# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 08-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఫాస్ఫేట్ పొటాషియం ఎరువులపై 2026 ఖరీఫ్ సీజన్‌కు పోషకాధారిత రాయితీ రేట్లను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లను యధాతథంగా కొనసాగించనుందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు.
- దేశంలో ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ సరఫరా సాధారణ స్థాయిలో జరుగుతోందని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ పేర్కొంది.
- అసోం, కేరళం, పుదుచ్చేరి శాసన సభలకు రేపు పోలింగ్ జరగనుంది.
- ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఢిల్లీ వేదికగా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఫాస్ఫేట్ పొటాషియం ఎరువులపై 2026 ఖరీఫ్ సీజన్‌కు పోషకాధారిత రాయితీ రేట్లను కేంద్రమంత్రి వర్గం ఈరోజు ఆమోదించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. న్యూఢిల్లీలో పాత్రికేయులకు ఆ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలియచేశారు. 2026 ఖరీఫ్ సీజన్‌కు తాత్కాలిక బడ్జెట్ అవసరం సుమారుగా 41,533 కోట్ల రూపాయలు ఉంటుందని చెప్పారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా రైతులకు రాయితీతో అందుబాటు ధరలలో ఎరువులు లభిస్తాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

ఇదిలా ఉండగా రాజస్థాన్ లోని ప్రహ్లాద్‌పుర నుండి తోడి మోడ్ వరకు 41 కిలోమీటర్ల పొడవైన జైపూర్ మెట్రో ఫేజ్-2కు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో 36 స్టేషన్లు ఉంటాయని, ఈ ప్రాజెక్టుకు 13 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేయనున్నట్లు కేంద్రమంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఇరాన్‌తో రెండు వారాల కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. హర్ముజ్ జల సంధి మీదుగా నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. ఈ ఒప్పందం పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి, హర్ముజ్ జలసంధి ద్వారా నిరాటంకమైన నౌకాయాన స్వేచ్ఛకు, ప్రపంచ వాణిజ్య కార్యక్రమాలకు దారి కల్పిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణలకు త్వరగా ముగింపు పలకడానికి చర్చలు, దౌత్యం అవసరమని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులపై మంత్రుల బృందంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలను ఈ సమావేశంలో సమీక్షించినట్లు సామాజిక మాధ్యమంలో చేసిన పోస్టులో కేంద్రమంత్రి వెల్లడించారు. రైతులకు ఎల్‌పిజి, పెట్రోల్, డీజిల్, ఎరువులు నిరంతరం అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అలాగే దేశంలో నిత్యావసర వస్తువుల సరఫరాను సులభతరం చేస్తోందని రాజ్‌నాథ్ సింగ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వడ్డీ రేట్లను 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తొలి ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని ప్రకటిస్తూ.. ద్రవ్య విధాన కమిటీ రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించిందని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈరోజు తెలిపారు. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిస్థితులు వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయన్నారు. ఎగుమతులకు మద్దతు ఇవ్వడం, సరఫరా గొలుసులను పరిరక్షించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పలు చర్యలు ఈ ప్రతికూల ప్రభావాన్ని తగ్గించగలవని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

అసోం, కేరళం రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం అయిన పుదుచ్చేరి శాసన సభలకు రేపు పోలింగ్ జరగనుంది. అసోంలో 126 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరగబోయే ఎన్నికల కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. మొత్తం 722 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 2.5 కోట్లకు పైగా ఓటర్లు నిర్ణయించనున్నారు. కేరళంలోని మొత్తం 140 అసెంబ్లీ నియోజకవర్గాలకు రేపు ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, శాంతియుత పోలింగ్ కోసం అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పుదుచ్చేరిలో పోలింగ్ సజావుగా, సురక్షితంగా జరిగేలా చూసేందుకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇదిలా ఉండగా పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేయడానికి రేపటితో గడువు ముగుస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భవానిపూర్ నుండి నామినేషన్‌ను ఈరోజు దాఖలు చేశారు. అదే విధంగా త్రిపురలోని ధర్మనగర్ అసెంబ్లీ ఉప ఎన్నికకు రేపు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ఈరోజు స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో జరిగిన అంతర-మంత్రిత్వ శాఖల సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్ కస్సీ మాట్లాడుతూ... పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బొగ్గు ధర పెరగలేదని, తగినంత నిల్వలను కొనసాగించామని తెలిపారు. పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ తగినంత పరిమాణంలో అందుబాటులో ఉన్నాయని, సాధారణ సరఫరా కొనసాగుతోందని చెప్పారు. గృహాలకు 100 శాతం సరఫరాను నిర్ధారించడానికి దేశీయ వినియోగదారులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆమె వివరిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని యువతను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడంలో పీఎం ముద్రా యోజన (పీఎంఎంవై) ఎంతో ప్రయోజనకరంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2015 ఏప్రిల్ 8న ప్రారంభమైన ముద్రా యోజన ఈ రోజుకు 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో ప్రధానమంత్రి ఈ పథకం ద్వారా దేశంలో యువతకు కలుగుతున్న ప్రయోజనాలను గుర్తు చేశారు. యువతకు సరైన అవకాశాలు కల్పించినప్పుడే  వారు స్వయం సమృద్ధి సాధించగలరని అన్నారు. ఈ విధంగా ఈ పథకం దేశ ప్రగతికి గణనీయంగా దోహదపడిందని పేర్కొన్నారు. పీఎం ముద్రా యోజన రుణ లభ్యతకు కొత్త నిర్వచనం ఇచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా పారిశ్రామిక స్ఫూర్తిని బలోపేతం చేసిందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పోషణ పక్షోత్సవం-2026ను రేపటి నుండి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంచి పోషణ ఉన్న బిడ్డ బలమైన దేశానికి పునాది అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోషణ్ అభియాన్ కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి తల్లికి, బిడ్డకు సంపూర్ణ పోషణను అందించేందుకు ఇది ఒక ప్రజా ఉద్యమం అని ఆయన పేర్కొన్నారు. జీవితంలోని మొదటి ఆరు సంవత్సరాలలో మెదడు అభివృద్ధిని గరిష్ఠ స్థాయికి చేర్చడం మీద అవగాహన కల్పించడం పోషణ పక్షోత్సవం ఇతివృత్తంగా ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) భాగంగా ఢిల్లీలోని అరుణ జైట్లీ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ టైటాన్స్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

బంకిం చంద్ర ఛటోపాధ్యాయ వర్ధంతి సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆయనకు ఈ రోజు నివాళులర్పించారు. ఆయన రచించిన వందేమాతరం గీతం దేశానికి ఒక గొప్ప ఆరాధనా మంత్రాన్ని అందించిందని కొనియాడారు. భారతీయులను ఒకే తాటిపైకి తీసుకుని వచ్చి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. రాబోయే తరాలకు కూడా బంకిం చంద్ర ఛటోపాధ్యాయ స్ఫూర్తి కొనసాగుతుందని ఓం బిర్లా చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74 వేల 616 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 2,946 పాయింట్ల లాభంతో 77 వేల 562 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 873 పాయింట్లు లాభపడి 23 వేల 995 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 92 రూపాయల 59 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =